సాక్షి
అనంతపురం

శుక్రవారం । 14 । జూలై । 2023

I



చీనీ @ రూ.20 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను కాయలు గరిష్టంగా రూ.20 వేలు పలికాయి.



'యూ-ఇన్'పై శిక్షణ
కేంద్ర ప్రభుత్వ యూ-ఇన్ పోర్టల్‌పై గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చారు.

గరిష్టం/కనిష్టం
37.1°/23.4°
జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

బీసీ కార్పొరేషన్ ఈడీ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ గౌతమికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఈడీ సుబ్రమణ్యం

అనంతపురం రూరల్/అర్బన్: జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా సుబ్రమణ్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా పని చేస్తున్న ఆయన్ను అనంతపురానికి బదిలీ చేస్తూ రెండు రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతల స్వీకరణ సందర్భంగా నూతన ఈడీకి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ ఎం.గౌతమిని ఈడీ సుబ్రమణ్యం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విమర్శలకు తావివ్వకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని సూచించారు.

చీఫ్ కోచ్‌గా నరసింహా రెడ్డి



ఉత్తర్వులు అందుకుంటున్న నరసింహా రెడ్డి

అనంతపురం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్‌గా పి. నరసింహా రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆన్‌సెట్ సీఈఓ కేశవ నాయుడు నగరంలో ఆయనకు గురువారం ఉత్తర్వులు అందజేశారు. ఇక్కడ పనిచేస్తున్న జగన్నాథ రెడ్డి నెల్లూరుకు బదిలీ అయ్యారు.

అరిసికెరకు ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: అరిసికెరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ తెలిపారు. సికింద్రాబాద్-అరిసికెర (07231/ 32) మధ్య ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 29 వరకూ రాకపోకలు సాగిస్తాయని వెల్లడించారు. సికింద్రాబాద్ జంక్షన్‌లో (07231) ప్రతి గురువారం రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు అరిసికెరకు మధ్యాహ్నం 1.00 గంటలకు చేరుతుంది. తిరిగి అరిసికెర జంక్షన్ (07231) నుంచి మధ్నాహ్నం 2కు బయలుదేరి మరుసటి రోజు శనివారం ఉదయం 8.30కు చేరుతుందని తెలిపారు. కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్, కర్నూలు, డోన్, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యలహంక, తుమకూరు మీదుగా రైళ్లు వెళ్తాయని ఆయన వివరించారు.

అమ్మ ఒడి చల్లగా..

- పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్న పథకం
- బడుల్లో పెరిగిన విద్యార్థుల హాజరు శాతం
- ఫలిస్తున్న సీఎం జగన్ సంకల్పం





నాల్గో విడత అమ్మఒడికి సంబంధించి గత నెల 28న మెగా చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కలెక్టర్ గౌతమి తదితరులు

రాప్తాడురూరల్: "మన పిల్లలు ప్రపంచ స్థాయికి ఎదగాలంటే చదువు ఒక్కటే ఏకైకమార్గం" అని గట్టిగా నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.. ఏ ఒక్క పేద కుటుంబానికి పిల్లలను బడులకు పంపడం ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో 'జగనన్న అమ్మఒడి'కి శ్రీకారం చుట్టారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పథకం లేదు. నిరుపేద తల్లిదండ్రులకు అమ్మ ఒడి పథకం కొండంత అండగా నిలుస్తోంది. ఈ పథకం కింద 1 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఏడాదికి ఒక విద్యార్థికి రూ. 15 వేలు చొప్పున అందిస్తున్నారు. ఈ మొత్తాన్ని తల్లి ఖాతాలో జమ చేస్తున్నారు. 2020 జనవరి 26న ఈ పథకం ప్రారంభమైంది. వరుసగా నాలుగేళ్ల విజయవంతంగా అమలు చేశారు. తొలి ఏడాది రూ. 15 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేసినా... తర్వాత ఏడాది నుంచి పాఠశాలల నిర్వహణలో వారి భాగస్వామ్యం ఉండాలనే ఉద్దేశంతో రూ. 2 వేలు బడులకు ఇచ్చేలా ఒప్పించారు. దీంతో పాఠశాల, మరుగుదొడ్ల నిర్వహణ కోసం రూ. 2 వేలు మినహాయించి తక్కిన రూ. 13 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో గత నాలుగేళ్లలోనే (రెండేళ్లు ఉమ్మడి జిల్లా) 11,74,374 మంది విద్యార్థుల కోసం రూ. 1,718.88 కోట్లు ఖర్చు చేశారు.

పెరిగిన విద్యార్థుల హాజరు శాతం

విద్యా సంవత్సరంలో 75 శాతం హాజరు ఉంటేనే అమ్మఒడి పథకం వర్తిస్తుందనే నిబంధన తీసుకొచ్చారు. దీంతో విద్యార్థుల హాజరుశాతం బాగా పెరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గతంలో రోజుల తరబడి బడులకు గైర్హాజరయ్యేవారని ఇప్పుడా పరిస్థితి లేదంటున్నారు. చదువుల విషయంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యతగా వ్యవహరిస్తుండడం గొప్ప పరిణామమని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు చెబుతున్నారు.

అమ్మఒడి అమలు ఇలా..

- 1-ఇంటర్ విద్యార్థులకు ఏడాదికి రూ. 15 వేలు
- తల్లుల ఖాతాల్లో- రూ. 13 వేలు
- పాఠశాల, కళాశాల నిర్వహణకు- రూ. 2 వేలు
- నాలుగేళ్లలో జిల్లాలో ఖర్చు చేసిన మొత్తం- రూ.1,718.88 కోట్లు
- లబ్ధి పొందిన విద్యార్థులు- 11,74,374 మంది

థ్యాంక్యూ జగన్ మామయ్య..



నాకు 7వ తరగతి నుంచి అమ్మ ఒడి డబ్బులు పడుతున్నాయి. వరుసగా నాలుగేళ్లు మా అమ్మ ఖాతాలో జమయ్యాయి. మానాన్న చేనేత కార్మికుడు, అమ్మ ఇంట్లోనే ఉంటోంది. నా చదువులకు మా అమ్మానాన్నకు రూపాయి కూడా ఖర్చు లేదు. జేవీకే కిట్‌లోనే అన్ని వస్తువులు ఉంటాయి. దీనికితోడు జగన్ మామయ్య అమ్మఒడి పథకంతో ఏటా రూ. 13 వేలు ఇస్తున్నాడు. ఇంతకంటే ఇంకేం కావాలి. థ్యాంక్యూ జగన్ మామయ్య.

– పూజిత, పదో తరగతి, సిండికేట్‌నగర్, అనంతపురం రూరల్

హాజరు శాతం బాగా పెరిగింది



ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులపై అమ్మఒడి పథకం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. గతం కంటే ఈ పథకం అమలైన ప్పటి నుంచి విద్యార్థుల హాజరుశాతం బాగా పెరిగింది. కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు, జగనన్న విద్యా కానుక కిట్లు, నాణ్యమైన భోజనం పెడుతుండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పంపేందుకు ఆసక్తి చూపుతున్నారు. అమ్మఒడి పథకం డబ్బుతోనే పిల్లలను చదివిస్తున్నారు. తల్లిదండ్రులపై పైసా కూడా భారం పడడం లేదు.

– దివాకర్‌రెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, సిండికేట్‌నగర్

హస్త కళాకారులకు చేయూతనిద్దాం

- రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి



మాట్లాడుతున్న విజయలక్ష్మి

అనంతపురం కల్చరల్: హస్త కళాకారులకు ప్రజలు చేయూతనివ్వాలని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి తెలిపారు. అనంతపురం లేపాక్షి ఎంపోరియంను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ త్వరలో నగరంతో పాటు పలుచోట్ల వైఎస్సార్ క్రాఫ్ట్ బజార్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కళాకారులకు రూ. 8 వేల పెన్షన్ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడం ఆనందకరమన్నారు. ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడితోనే ఫించన్ అందించేందుకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ఈ సంవత్సరం ఎంపోరియంలలో రూ.72 కోట్ల అమ్మకాలు జరిగాయని వెల్లడించారు.ఉమ్మడి అనంతపురం జిల్లాలో హస్తకళాకారులకు ప్రోత్సాహమిచ్చేందుకు గిఫ్ట్ కల్చర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, చేనేత కార్మిక నేత మిద్దె నాగరాజు తదితరులున్నారు.

ఇద్దరిపై క్రిమినల్ కేసులు

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడురూరల్: సమగ్ర శిక్ష కార్యాలయంలో ఈఈ, డీఈ పేర్లతో లాగిన్లు ప్రారంభించి సాగించిన సబ్సిడీ సిమెంట్ దందా వ్యవహారంలో ఇద్దరి ఉద్యోగులపై అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. దాదాపు 70 లోడ్ల సిమెంట్‌ను బ్లాక్‌మార్కెట్‌కు తరలించిన ఘటనపై 'సాక్షి'లో కథనాలు రావడంతో అనంతపురం, శ్రీసత్యసాయి కలెక్టర్లు గౌతమి, అరుణ్‌బాబు సీరియస్‌గా పరిగణించారు. తాత్కాలికంగా ఇద్దరు ఉద్యోగులను తప్పిస్తూ క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని ఆదేశించారు. రెండు వారాలవుతున్నా కేసు నమోదు కాలేదు... ఇద్దరు ఉద్యోగులను విధుల నుంచి తప్పించలేదు. ఈ క్రమంలో బుధవారం 'సాక్షి'లో 'కేసు నమోదులో తాత్సారం' శీర్షికతో కథనం వెలువడింది. స్పందించిన అధికారులు ఆగమేఘాలపై అదే రోజు కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్‌ను విధుల నుంచి తప్పించారు. అలాగే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదు చేశారు. 420, 406 రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు. సమగ్ర వివరాలన్నీ పోలీసుల దర్యాప్తులో బయటకు రానున్నాయి,

నాడు-నేడు పనుల్లో ఎందుకు వెనుకబడ్డారు..?

- వివరణ ఇవ్వాలని పీడీలకు నోటీసులు

అనంతపురం సెంట్రల్: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఐసీడీఎస్ పీడీలు శ్రీదేవి, లక్ష్మీకుమారీలకు మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ విజయ సునీత గురువారం నోటీసులు జారీ చేశారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ భవనాల నిర్మాణంలో ఎందుకు వెనుకబడ్డారో మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతపురం జిల్లాలో 91 భవనాలు మంజూరు కాగా 73 బేస్‌మెంట్, శ్రీ సత్యసాయి జిల్లాలో 61 భవనాలు మంజూరు కాగా బేస్‌మెంట్ లెవల్‌లోనే 49 ఉన్నాయి.

తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు

- టీడీపీ కార్యాలయంలోనే బాహాబాహీకి దిగిన వైనం
- పట్టణ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు



టీడీపీ కార్యాలయంలో ఉమా ఫ్లెక్సీలను చించేసిన దృశ్యం

కళ్యాణదుర్గం: ఆధిపత్యపోరులో తెలుగు తమ్ముళ్లు సొంత పార్టీ నేతలపైనే దాడులకు తెగబడుతున్నారు. కళ్యాణదుర్గంలో తెలుగుతమ్ముళ్లు పార్టీ కార్యాలయంలోనే దాడులు చేసుకున్నారు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది.

ఫ్లెక్సీ చించడంతో గొడవ

కళ్యాణదుర్గం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉమా మహేశ్వరనాయుడు వ్యవహరిస్తున్నారు. అతనికి పోటీగా సీనియర్ నేత ఉన్న హనుమంతరాయ చౌదరి పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో నియోజకవర్గంలో టీడీపీ నేతలు కూడా రెండు వర్గాలుగా విడిపోయారు. ప్రస్తుతం ఉమా మహేశ్వరనాయుడు ఇన్‌చార్జ్‌గా ఉండగా, అతని అనుచరుడు ఈశ్వరప్ప టీడీపీ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 12వ తేదీ (బుధవారం) రాత్రి శ్రీనివాసులు అనే మరో కార్యకర్త టీడీపీ కార్యాలయం వద్దకు వచ్చాడు. టీడీపీలో ఇరు వర్గాలపై దుమ్మెత్తిపోస్తూ నేతల తీరుపై మండిపడ్డాడు. అంతటితో ఆగకుండా ఆగ్రహంతో ఉమా మహేశ్వరనాయుడు చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీలను చింపివేశాడు. అక్కడే ఉన్న ఈశ్వరప్ప అడ్డుకునే ప్రయత్నం చేయగా, అతనిపై దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నాడు. ఒకరినొకరు దుర్భాషలాడుకుంటూ దాడులు చేసుకున్నారు. అక్కడే ఉన్న కొందరు జోక్యం చేసుకుని ఇరువురినీ వారించారు. అనంతరం ఈశ్వరప్ప తనపై దాడికి దిగి గాయపరిచారంటూ శ్రీనివాసులుపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఐ తేజమూర్తి కేసు నమోదు చేశారు.

దివ్యాంగులకు పునరావాస కేంద్రం

- కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయండి
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: దివ్యాంగులకు పునరావాస కేంద్రం (డీడీఆర్‌సీ) ఏర్పాటుకు జిల్లా కేంద్రంలో భవనాన్ని గుర్తించడంతో పాటు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆమె సమావేశం నిర్వహించారు. దివ్యాంగుల అవసరాలపై ప్రణాళిక సమర్పించాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ అబ్దుల్ రసూల్‌ను ఆదేశించారు. కేంద్రాన్ని రెడ్‌క్రాస్ సొసైటీకి అప్పగించేలా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన చేయాలని చెప్పారు. శస్త్ర చికిత్సలు, వినికిడి పరికరాలు అమర్చడం, రెఫరల్ ఆస్పత్రులకు సిఫారుసు చేయడం, ఉపకరణాల అందజేతకు చర్యలు తీసుకోవాలన్నారు. సదరం క్యాంపు ద్వారా సర్టిఫికెట్లను డీఎంహెచ్‌ఓ ద్వారా అందించాలన్నారు. ఉపాధి కోర్సుల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ నరసింహా రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి తదితరులున్నారు.

గడువులోగా రీ-సర్వే పూర్తి చేయాలి

'జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష' పథకం రీ-సర్వేను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రి దేవితో కలసి తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. డేటా ఎంట్రీ కచ్చితంగా ఉండాలన్నారు. హద్దు రాళ్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డీఓలు నిశాంత్‌రెడ్డి, మధుసూదన్, రవీంద్ర, సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

టమాట తగ్గేదేలే..

కిలో రూ.133 పలికిన వైనం



అనంతపురం అగ్రికల్చర్: టమాట ధర ఎగసిపడుతోంది. రికార్డు స్థాయి ధరలతో హోరెత్తిస్తోంది. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గురువారం స్థానిక కక్కలపల్లి మార్కెట్‌లోని ఓ మండీలో ఏకంగా కిలో రూ.133 గరిష్ట ధర పలికి రికార్డు సృష్టించింది. 15 కిలోల టమాట బాక్సు ధర వేలంలో రూ.2 వేలు టాప్‌రేట్ పలికినట్లు మండీ నిర్వాహకులు రమణ తెలిపారు. సరుకు చాలా తక్కువగా వస్తుండటంతో ధర ఎక్కువ పలుకుతోందని మార్కెటింగ్‌శాఖ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. దేశ వ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అకాల వర్షాలు, అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా పంట సాగు, దిగుబడులు తగ్గినట్లు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో టమాట సాగుకు అనుకూలం లేనందున మార్కెట్‌కు సరుకు తక్కువగా వస్తోంది. ఆగస్టులో ధరలు తగ్గవచ్చని అంచనా.

క్లుప్తంగా

తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహం



గుంతకల్లు రూరల్: గుంతకల్లులోని సిద్దేశ్వర్ నగర్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పైప్ లైన్ పనుల తవ్వకాల్లో ఓ పురాతన రాతి విగ్రహం బయటపడింది. నీటి సమస్య తలెత్తడంతో అక్కడ గురువారం పైప్‌లైన్‌కు మరమ్మతు చేసేందుకు మున్సిపాలిటీ సిబ్బంది తవ్వుతుండగా రాతి విగ్రహం బయటపడింది. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని రాతి విగ్రహాన్ని పరిశీలించారు. విల్లు ఎక్కు పెట్టిన రాముడు, పక్కనే సీత ఉన్నట్లుగా రాతిపై చెక్కారంటూ జనాలు పేర్కొన్నారు.

కిడ్నాప్ కలకలం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆర్థిక వివాదల కారణంగా ఓ జంటను కిడ్నాప్ చేశారంటూ బాధిత కుటుంబసభ్యులు డయల్ 100కు ఫోన్ చేయడంలో పోలీసులు ఉరుకులు, పరుగులు తీశారు. అనంతపురం మూడో పట్టణ పోలీసుల తెలిపిన మేరకు.. ఆత్మకూరు మండలం తలుపూరుకు చెందిన నరసింహులు, గొట్కూరుకు చెందిన వీఆర్‌ఏ ఎర్రిస్వామి బావ, బామ్మర్దులు. ఇద్దరూ కలిసి అనంతపురంలోని ఓ మెడికల్ షాపు యజమానితో అప్పు చేశారు.తీసుకున్న డబ్బు తిరిగి చెల్లించకపోవడంతో పలుమార్లు నరసింహులు, ఎర్రిస్వామిని షాపు యజమాని హెచ్చరించాడు. అయినా వారిలో మార్పు రాకపోవడంతో ఊళ్లో పంచాయతీలు నిర్వహించి, గొడవలు కూడా పడ్డారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 8 గంటలకు నరసింహులు దంపతులను పది మందితో కలసి మెడికల్ షాపు యజమాని తన వాహనంలోకి బలవంతంగా ఎక్కించుకుని వెళ్లాడు. త్రీటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఎల్‌బీనగర్‌లో ఉన్న శ్రీనివాసులు ఇంటి వద్ద వీఆర్‌ఏ ఎర్రిస్వామి ఉన్నాడన్న అనుమానంతో వారి ఇంటికెళ్లి ఆరా తీశారు. అక్కడ లేడని నిర్ధారించుకున్నారు. అప్పటికే వీఆర్‌ఏ ఎర్రిస్వామి భార్య అక్కమ్మ డయల్ 100కుచేసి తన భర్తను కూడా మెడికల్ షాపు వారు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలో దిగిన పోలీసులు చివరకు నాల్గో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉన్నట్లుగా తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఇదే విషయాన్ని అక్కమ్మకు సీఐ ధరణీ కిషోర్ తెలపడంతో కుటుంబ సభ్యులందరూ అక్కడకు చేరుకున్నారు. ఇంతలో తలుపూరు గ్రామానికి చెందిన పెద్దమనుషులు జోక్యం చేసుకుని సర్ది చెప్పి బాధితులను పిలుచుకెళ్లారు.

'క్యాంపస్'లో కోర్సుల కోత

- బీటెక్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమలుకు నిరాకరణ
- ఎంటెక్‌లో బ్రిడ్జి ఇంజినీరింగ్ కోర్సుకు మాత్రమే అనుమతి
- ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంటెక్‌లో పది కోర్సులు



అనంతపురం: మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్య కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రపంచీకరణ నేపథ్యంలో కంపెనీ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరుల ఉత్పాదన అనివార్యమైంది. దీంతో మార్కెట్ అవసరాలకు దీటుగా ఉండే కొత్త కోర్సుల అభ్యాసన తప్పనిసరిగా మారింది. ఈ నేపథ్యంలో బీటెక్ కోర్సుల్లోనూ సమూల మార్పులు వస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు సరికొత్త కోర్సులు అమలు చేస్తూ విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. అయితే 77 ఏళ్ల ఘన చరిత కలిగిన జేఎన్‌టీయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త కోర్సుల అమలుకు నిరాకరణ ఎదురవుతోంది. ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుకునే క్యాంపస్ కళాశాలలో కొత్త కోర్సులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థుల్లో నిరాశ వ్యక్తమవుతోంది.

బీటెక్‌లో ఏఐ అండ్ ఎంఎల్ కోర్సు లేనట్లే

జేఎన్‌టీయూ (అనంతపురం) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇప్పటి వరకూ మెకానికల్, సివిల్, కంప్యూటర్ సైన్సెస్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ కోర్సులు ఉన్నాయి. వీటికి తోడు 2022–23 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో మెషిన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును ప్రవేశపెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు ఏఐసీటీఈ నుంచి అనుమతి కూడా తీసుకున్నారు. అయితే కొత్త కోర్సు అనుమతికి గత పాలకమండలి సమావేశంలో ఆమోదం దక్కలేదు. నూతన కోర్సుల అమలుకు పాలకమండలి ఆసక్తి కనబరచక పోవడంతో గతంలో ఉండే ఆరు బ్రాంచుల్లోనే ఈ ఏడాది ఇంజినీరింగ్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఫలితంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చేరాల్సిన అనివార్యమైన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఎంటెక్‌లోనూ కోతే!

జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ కోర్సుల్లో ఇప్పటి వరకూ 24 బ్రాంచులుండేవి. 2022–23 విద్యా సంవత్సరం నుంచి వీటిని కేవలం 10 బ్రాంచ్‌లకే పరిమితం చేశారు. ప్రస్తుతం స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, పవర్ సిస్టమ్స్, పవర్ అండ్ ఇండస్ట్రియల్ డ్రైవ్, రెఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండీషనల్, డిజిటల్, ఎలక్ట్రికల్ అండ్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్సెస్, నానో టెక్నాలజీ, వీఎల్ఎస్ఐ అండ్ డిజైన్ కోర్సులతో పాటు తాజాగా సివిల్ ఇంజినీరింగ్‌లో బ్రిడ్జ్ టెక్నాలజీ (బ్రిడ్జి అండ్ టన్నెల్) బ్రాంచ్‌ను అదనంగా ప్రవేశపెట్టారు. మిగిలిన 14 బ్రాంచ్‌లకు కోత పెట్టారు.

అవకాశం దక్కితేనే ఉపాధి

అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేయాలనే ఆకాంక్ష ఎంతో మంది విద్యార్థులకుంది. ఈ క్రమంలో అదనంగా బీటెక్‌లో బ్రాంచ్ ఏర్పడితే విద్యార్థులకు గొప్ప సదావకాశంగా ఉంటుంది. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్, కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో మొత్తం 360 ఇంజినీరింగ్ సీట్లు ఉన్నాయి. తాజాగా కొత్త బ్రాంచ్ ఏర్పడితో మరో 60 సీట్లు అందుబాటులోకి వస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుకు తాజాగా భారీ డిమాండ్ ఉంది. ఈ కోర్సును అందుబాటులోకి తెస్తే ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యార్థులకు గొప్ప వరంగా మారుతుంది.

జేఎన్‌టీయూ(ఏ)లో సీటుకు భారీ డిమాండ్

ఎంసెట్‌లో గణనీయమైన ర్యాంకులు దక్కిన వారికే జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాలలో సీటు దక్కే పరిస్థితి ఉంది. ఈ కళాశాలలో ఇంజినీరింగ్ అడ్మిషన్లకు భారీ డిమాండ్ ఉంది. ఈ క్రమంలో సెట్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులు మొదటి ఆప్షన్ కింద జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్ కళాశాలనే ఎంపిక చేసుకుంటున్నారు. దీంతో ఏటా అత్యుత్తమ ర్యాంకర్లకే ఈ కళాశాలలో సీట్లు దక్కుతున్నాయి. క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఏటా పేరెన్నికగల బహుళజాతి సంస్థల్లో 300 మందికి పైగా కొలువులు దక్కించుకుంటున్నారు. దీంతో ఈ కళాశాలలో సీటు హాటుకేక్‌గా మారింది. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ(ఏ) ఉన్నతాధికారులు పునరాలోచించి బీటెక్‌లో అదనపు బ్రాంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రతిపాదనను పరిశీలిస్తాం



జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్తగా బీటెక్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ కోర్సు ఏర్పాటు ప్రతిపాదన ఉంది. ఈ ప్రతిపాదనను మరోసారి పరిశీలిస్తాం. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంటెక్‌లో బ్రిడ్జ్ టెక్నాలజీ కోర్సును అందుబాటులోకి తీసుకువచ్చాం.

– ఆచార్య జింకా రంగజనార్ధన, వీసీ, జేఎన్‌టీయూ(ఏ)

అండర్-19 లో 'అనంత' ప్రతిభ



అర్జున్ టెండూల్కర్

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ –19 అంతర జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా అనంతపురం, చిత్తూరు జిల్లా జట్ల మధ్య జరుగుతున్న మల్టీ డే మ్యాచ్‌లో అనంతపురం జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 54.4 ఓవర్లలో 191 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతపురం తొలి ఇన్నింగ్స్‌లో 253 పరుగులు చేసింది. పి.అర్జున్ టెండూల్కర్ 59, కేహెచ్ వీరారెడ్డి 50, ప్రశాంత్ 79 పరుగులు సమష్టిగా ప్రతిభ సాధించారు. చిత్తూరు రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులు చేసింది. అనంతపురం రెండో ఇన్నింగ్స్‌లో 147 పరుగులు చేసి ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ అర్జున్ టెండూల్కర్ 47 బంతుల్లో 97 పరుగులు (14 ఫోర్లు, 5 సిక్సర్లు) చెలరేగి ఆడారు. దీంతో అనంతపురం జట్టుకు విజయం ఖాయమైంది.

పవన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

- ఆరోపణలు కాదు ఆధారాలు చూపాలి
- మాజీ ఎమ్మెల్యే విశ్వ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, పైలా నరసింహయ్య

ఉరవకొండ: వలంటీర్లపై పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. మదమెక్కి నోటికొచ్చినట్లు మాట్లాడడం సబబు కాదని హితవు పలికారు. గురువారం ఉరవకొండ మేజర్‌పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ... తన పార్టీ విధివిధానాలపై ప్రజలను చైతన్య పరుచుకోవాల్సింది పోయి ఇతరులను కించపరిచి మాట్లాడం సరైంది పవన్ కళ్యాణ్ అవివేకానికి నిదర్శనమన్నారు. వలంటీరు వ్యవస్థను ప్రతిపక్షాలు రాజకీయ వ్యవస్థగా చూస్తుండటం సిగ్గుచేటన్నారు. ఏ ఆధారాలతో ఆరోపణలు చేశారో రుజువు చేయాలని సవాల్ విసిరారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా రాష్ట్రంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.3 లక్షల కోట్ల లబ్ధి ప్రజలకు చేరిందంటే అందుకు వలంటీర్ల వ్యవస్థే కారణమన్నారు. అప్పగించిన బాధ్యతలను ఎంతో హుందాగా యువత నిర్వర్తిస్తోందన్నారు. వలంటీర్ల వ్యవస్థపై మాట్లాడే నైతికత పవన్‌కు లేదని, ఇప్పటికైనా వలంటీర్లకు బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారిని కుష్బు కొఠారి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు రమణ, గోవిందు, వెంకటేష్, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు బసవరాజు, ఉరవకొండ పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి, సచివాలయ కన్వీనర్ ఆసీఫ్, ఓబులేసు, కోఆప్షన్ సభ్యుడు సలీం పాల్గొన్నారు.

ఉచిత సామూహిక వివాహాలకు దరఖాస్తు చేసుకోండి

పైలా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 19న పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జరిగే ఉచిత సామూహిక వివాహాలకు దరఖాస్తు చేసుకోవాలని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం వారు ఆవిష్కరించారు. నూతన వధూవరూలకు వస్త్రాలు, తాళిబొట్టు, మెట్టెలు ఇస్తామన్నారు.

చిలకూరి దీవెనకు అంబేడ్కర్ అవార్డు



చిలుకూరి దీవెనను సత్కరిస్తున్న యూనివర్సిటీ అధికారులు

అనంతపురం కల్చరల్: ప్రముఖ యువ రచయిత్రి చిలుకూరి దీవెన అంబేడ్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. గురువారం గుంటూరులో దళిత్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పురస్కార ప్రదాన సభ నిర్వహించారు. ప్రఖ్యాత రచయిత చిలుకూరి దేవపుత్ర కుమార్తె అయిన చిలుకూరి దీవెనకు వైస్ చాన్సలర్ ఆచార్య గుజ్జర్ల మూడి కృపాచారి, రెవరెండ్ స్వర్ణలతాదేవి తదితరులు అవార్డుతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారు.

ప్రయాణికుడికి సెల్‌ఫోన్ అప్పగింత

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మర్చిపోయిన రూ. 35 వేలు విలువజేసే సెల్‌ఫోన్‌ను ప్రయానికుడికి మేనేజర్ మూర్తి అందించారు. నెల్లూరు జిల్లాకు చెందిన రైల్వే కాంట్రాక్టర్ చౌదరి గురువారం తెల్లవారుజామున 5 గంటలకు ఆర్టీసీ బస్టాండ్‌లో దిగారు. తిరిగి రాయదుర్గం బస్సు ఎక్కారు. ఈ సమయంలో తన సెల్‌ఫోన్ పడిపోయింది. సదరు ప్రయాణికుడు బస్సు ఎక్కి రాయదుర్గం వెళ్లిపోయారు. తర్వాత చూసుకుంటే సెల్ కనిపించలేదు. అప్పటికే ఆర్టీసీ సిబ్బంది స్టేషన్ మేనేజర్ మూర్తికి సెల్‌ఫోన్ అందజేశారు. బాధితుడు ఫోన్ చేయడంతో విషయం తెలియజేశారు. అనంతరం బాధితుడికి సెల్‌ఫోన్ అందజేయడంతో ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

జనావాసాల్లోకి నెమలి



కళ్యాణదుర్గం: స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని ఇంటి ప్రహరీపై గురువారం నెమలి చూపరులను కనువిందు చేసింది. సాయంత్రం తేలికపాటి వర్షం కురవడంతో సమీపంలోని చెట్ల పొదల నుంచి జనావాసంలోకి నెమలి వచ్చింది. సుమారు పది నిమిషాలకు పైగా ప్రహరీపై సంచరిస్తూ చూపరులను ఆకట్టుకుంది.

మద్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఏఎస్పీ రామకృష్ణ

బెళుగుప్ప: మద్యం అక్రమ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ రామకృష్ణ హెచ్చరించారు. గురువారం ఉదయం బెళుగుప్ప పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. మండలంలో నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సిబ్బందితో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారు పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్య పరిష్కారానికి చొరవ చూపేలా చర్యలు తీసుకుంటామన్నారు. పదే పదే మద్యం కేసుల్లో పట్టుబడి, అక్రమ రవాణాకు పాల్పడితే జిల్లా బహిష్కరణ వేటు పడుతుందని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్పీ నర్సింగప్ప, సీఐ శేఖర్, ఎస్ఐ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

డీబీ ప్రశాంత్‌కుమార్ సెంచరీ



యోగానంద, డీబీ ప్రశాంత్ కుమార్, సీఆర్ జ్ఞానేశ్వర్

అనంతపురం: సౌత్ జోన్ అంతర జిల్లాల క్రికెట్ మల్టీ డే టోర్నీలో భాగంగా గురువారం జరిగిన నాల్గో రౌండ్ మ్యాచ్‌లో అనంతపురం–కర్నూలు, నెల్లూరు– చిత్తూరు జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 416 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఓపెనర్‌గా వచ్చిన డీబీ ప్రశాంత్ కుమార్ 171 బంతుల్లో 20 ఫోర్లు, 3 సిక్సర్లతో 156 పరుగులు సాధించాడు. మరో ఓపెనర్ బి.యోగానంద 209 బంతుల్లో 128 పరుగులు భాగస్వామ్యం అందించాడు. మరో బ్యాటర్ మహేందర్‌రెడ్డి 114 బంతుల్లో 75 పరుగులు చేశాడు. అలాగే చిత్తూరు, నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 80.2 ఓవర్లలో 374 పరుగులు చేసి ఆలౌట్ అయింది. సీఆర్. జ్ఞానేశ్వర్ 172 బంతుల్లో 144 పరుగులు, పి. సూర్య చరణ్ 125 బంతుల్లో 91 పరుగులు, దినేష్‌వర్మ 55 బంతుల్లో 61 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు వికెట్ నష్టపోకుండా 25 పరుగులు చేసింది.

వందశాతం ఫీజు వసూలే లక్ష్యం

- మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజినేయులు ఆదేశం



సమీక్షకు హాజరైన ఆర్జేడీ రామాంజినేయులు, డీడీఎం శ్రీకాంత్‌రెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది వంద శాతం ఫీజు వసూలు లక్ష్యాలు సాధించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని 17 మార్కెట్ కమిటీల అధికారులను మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) రామాంజినేయులు ఆదేశించారు. డీడీఎం శ్రీకాంత్‌రెడ్డి, ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, మూర్తితో కలసి గురువారం స్థానిక ఏడీఎం కార్యాలయంలో రెండు జిల్లాల మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో ఫీజు వసూలు అంశంపై ఆయన సమీక్షించారు. మొదటి మూడు నెలల కాలంలో 10 మార్కెట్‌యార్డుల పరిస్థితి ఆశాజనకంగా ఉన్నా... మిగిలిన ఏడింటిలో వసూళ్ల లక్ష్యం బాగా తగ్గిందన్నారు. అనంతపురం జిల్లాలో ఉన్న 9 కమిటీల ద్వారా రూ.10.81 కోట్ల వార్షిక లక్ష్యానికి గానూ రూ.2.86 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 7 కమిటీల ద్వారా రూ.4.72 కోట్లకు గానూ రూ. 1.22 కోట్లు వసూలైందన్నారు. గతేడాది మాదిరిగానే అన్ని కమిటీలు లక్ష్యానికి మించి వసూలయ్యేలా విజిలెన్స్ చర్యలు పటిష్టం చేయాలని ఆదేశించారు. రైతులకు సేవలందిస్తూనే యార్డుల అభివృద్ధికి ఆదాయ మార్గాలు అన్వేషించాలన్నారు. చెక్‌పోస్టుల ద్వారా వసూళ్లు పెరగాలన్నారు. చీనీ, చింత, ఎండుమిరప, పశువులు, జీవాల సంతలో పారదర్శకతకు పెద్దపీట వేయాలన్నారు. అంతకు ముందు అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో చీనీ క్రయ విక్రయాలపై వ్యాపారులు, రైతులు, అధికారులతో మాట్లాడారు. మరిన్ని మౌలిక వసతుల కల్పనకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

డిగ్రీని పాతపద్ధతిలోనే కొనసాగించాలి

అనంతపురం అర్బన్: నాలుగేళ్ల డిగ్రీని కొనసాగించాలనే నిర్ణయాన్ని రద్దు చేసి పాత పద్ధతిలో మూడేళ్ల డిగ్రీని కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు కుల్లాయిస్వామి అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జాన్సన్ బాబు హాజరై మాట్లాడారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. వివిధ డిమాండ్లతో ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి చిరంజీవి, నాయకులు రమణయ్య, హనుమంతు, ఉమామహేశ్, ఆంజనేయులు, వెంకటనాయక్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: నగరంలోని 32వ డివిజన్‌లోని ఆదర్శనగర్ సచివాలయం ఆవరణలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు గురువారం క్షీరాభిషేకం (పాలాభిషేకం) చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఏపీ కేబినెట్‌లో అసైన్డ్ భూములపై దళితులకు యాజమాన్య హక్కులు కల్పించే విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో 32వ డివిజన్ కార్పొరేటర్ కమల్‌భూషణ్, నాయకులు సాకే కుమార్, మొగతల ఉష, బండారు అశోక్, వర్దన్, నవీన్, పొట్టిపాటి కిరణ్, మిద్దె నగేష్ పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



సీఐ వై.నరేందర్ రెడ్డి

అనంతపురం: ఇటుకలపల్లి సీఐ వై.నరేందర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. కడప జిల్లా మైదుకూరు రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి ఆయన బదిలీ అయ్యారు.

చైతన్య విద్యాసంస్థల అధినేతకు నివాళి



బీఎస్ రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి, ఇతర సిబ్బంది

రాప్తాడురూరల్: శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ బీఎస్ రావు మృతికి సిబ్బంది నివాళులర్పించారు. గురువారం సాయంత్రం సీ-బ్యాచ్ బ్రాంచ్‌లో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా బీఎస్ రావు చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం పాఠశాలల అనంతపురం జోన్ ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత బీఎస్ రావు ఆకస్మిక మరణం చాలా బాధాకరమన్నారు. చైతన్య పాఠశాలల ప్రిన్సిపాళ్లు, డీన్లు, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతగా ఉంటాం

అనంతపురం కల్చరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన‌రెడ్డి అర్చక వ్యవస్థపై చూపుతున్న ఆదరణపై ఎప్పటికీ కృతజ్ఞతగా ఉంటామని ఏపీ అర్చక సమాఖ్య ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు సంఘం గౌరవాధ్యక్షుడు ద్వారకానాథాచార్యులు, అధ్యక్షులు పూజారి భీమప్ప, పులమాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. రూ.5 లక్షల్లోపు ఆదాయం ఉన్న ఆలయాలను అర్చకులకు అప్పగించడం, జీవితకాలం అర్చకత్వం చేసుకోవడానికి వీలుకల్పించడం హర్షణీయమన్నారు. ధూప దీప నైవేద్యం కింద రూ. 5 వేలు నుంచి రూ.10 వేలకు పెంచడానికి ఉదారంగా నిర్ణయం తీసుకున్న సీఎంకు రుణపడి ఉంటామని అన్నారు.

టీచర్లకు జీతాలు ఇవ్వాలి

రాప్తాడురూరల్: గత జూన్ నెలలో బదిలీ అయ్యి, కొత్త పాఠశాలలో చేరిన ఉపాధ్యాయులకు జీతాలు మంజూరు చేయాలని యూటీఎఫ్ నేత వి.కోటేశ్వరప్ప కోరారు. గురువారం అనంతపురం డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, గౌరవాధ్యక్షులు ఎస్‌వీవీ రమణయ్య, ఉపాధ్యక్షులు ఆర్.రామప్ప చౌదరి, సరళ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, ఆడిట్ కమిటీ మెంబర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



రాజీవ్‌కాలనీలో జరిగిన 'జగనన్న సురక్ష' సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పాలనలో సమూల మార్పులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాజీవ్‌కాలనీ సచివాలయ– 2 దగ్గర సర్పంచ్ ఆశాబీ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా రాజకీయ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి కార్యక్రమం ప్రజలకు మేలు చేసేదేనన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకుల దయ ఉంటే పథకాలు అందేవన్నారు. ఇప్పుడా ఆ పరిస్థితి లేదన్నారు. అర్హతే ప్రామాణికమన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోకపోతే టీడీపీ, జనసేన నాయకులను ప్రజలే తరిమికొడతారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సంధ్య, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల వేణుగోపాల్, హుస్సేన్, రహీమ్, కరీమ్, అంజి, దొలా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ వందశాతం పథకాలు

అనంతపురం క్రైం: అర్హులందరికీ వందశాతం పథకాలు వర్తింపజేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని రాణినగర్, అశోక్‌నగర్‌లో జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కొందరు రేషన్‌కార్డు, హౌస్ హోల్డ్‌లో కుటుంబ సభ్యులను వేరు చేస్తే పథకాలు వర్తిస్తాయని తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వివిధ కారణాలతో పథకాల జాప్యం జరిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వం 11 రకాల సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. రాణినగర్‌లో 133 మంది స్పాట్ ఆప్షన్‌కు దరఖాస్తు చేసుకున్నారని, అశోక్‌నగర్ ప్రాంతంలో ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారన్నారు. కామారుపల్లి లబ్ధిదారులకు మరో అనువైన ప్రాంతంలో స్థలాలను కేటాయించనున్నట్లు తెలిపారు. టిడ్కో ఇళ్ల డబ్బులు ప్రభుత్వం త్వరలో చెల్లించనుందన్నారు.

ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి:

కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రమాణికంగా ప్రజలకు ప్రభుత్వం మేలు చేస్తుంటే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా పని చేసి, ప్రజలకు ఏం చేశారో గుర్తు చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కేవలం నాలుగేళ్లలోనే రూ.లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా అందించడం జరిగిందన్నారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్ల మనోభావాలను దెబ్బతీసేలా పవన్ కళ్యాణ్ మాట్లాడారన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం గ్రూపు రాజకీయాలతో అభివృద్ధిని విస్మరించారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు సుమతి, నాగమణి, ఎం.దేవి, వై.లక్ష్మీదేవి, లీలావతి, నరసింహులు, వెంకటరమణ, సైఫుల్లాబేగ్, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, లక్ష్మన్న, వైఎస్సార్ సీపీ నాయకులు గౌస్‌బేగ్, బలరాం, జావెద్, తదితరులు పాల్గొన్నారు.

ఈఈఈ విభాగాధిపతిగా ఎం.రామశేఖర్ రెడ్డి



రామశేఖర్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న రిజిస్ట్రార్ సి.శశిధర్

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగాధిపతిగా డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. రామశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి విభాగాధిపతి బాధ్యతలు అప్పగించినందుకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్‌కు ధన్యవాదాలు తెలిపారు. జేఎన్‌టీయూ అనంతపురం పీఆర్వోతో పాటు, ఈఈఈ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, పీఆర్వో కార్యాలయం సిబ్బంది వెంకటరమణ, రాము, చిన్న ఆంజనేయులు శుభాకాంక్షలు తెలిపారు.

డబ్బు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

అనంతపురం క్రైం: వివిధ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారుల నుంచి ఒక్కొక్కరితో రూ.35వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అమినిటీ, మెప్మా సిబ్బందిని హౌసింగ్ పీడీ కేశవనాయుడు ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థలో సిబ్బందితో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కురుగుంట లేఅవుట్‌లో స్థలాలు పొందిన లబ్ధిదారుల ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, టీపీఆర్‌ఓ విశ్వజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



నగరంలో కూలిపోయిన సభా వేదిక

నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో గురువారం సీపీఎం బహిరంగ సభ జరిగింది. సభ ముగిసిన అనంతరం వేదికను సమీపిస్తూ శ్రీసాయి బాలాజీ ట్రావెల్స్ బస్సు అటుగా వెళ్లింది. ఈ క్రమంలో బహిరంగ సభకోసం లాగిన విద్యుత్ తీగలు బస్సుకు తగిలాయి. దీంతో విద్యుత్ తీగలు కట్టిన టెంట్ పైపు కింద పడి టెంట్ మొత్తం కుప్పకూలింది. సీపీఎం ఓ కార్యకర్తతో పాటు మరికొందరికి చిన్నపాటి గాయాలు అయ్యాయి. అయితే త్రుటిలో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు చర్చించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎం.బండమీదపల్లిలో ఎంపీడీఓ సాల్మన్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సచివాలయ పరిధిలో దరఖాస్తు చేసుకున్న 191 మందికి సర్టిఫికెట్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పథకాలు టీడీపీ వారికి మాత్రమే అందేవన్నారు. మాప్రభుత్వం సంక్షేమ పథకాలు విరివిగా అందుతున్నాయన్నారు. 8 కిలో మీటర్ల బండమీదపల్లి గడ చెరువు కాలువ నిర్మాణానికి రూ.కోటి కూడా ఖర్చుకాదని, రూ.8 కోట్లు టీడీపీ నాయకులు తీసుకున్నారన్నారు. దాతలు, రైతులు, కార్యకర్తల సహకారంతో 80 కిలో మీటర్ల మేర కాలువ నిర్మాణం చేపట్టామన్నారు. ఎం.బండమీదపల్లిలో ఇప్పటికి 787 మందికి ఆసరా రుణాలు మాఫీ అయ్యాయని, 585 మందికి పింఛన్లు ఇస్తున్నామని, 328 మందికి ఇళ్లు మంజూరు చేశామన్నారు. చేయూత ద్వారా 201 మంది అక్కచెల్లెమ్మలకు స్వయం ఉపాధి కల్పిస్తున్నామన్నారు. అమ్మఒడి ద్వారా 370 మంది తల్లుల ఖాతాల్లో తమ బిడ్డల చదువుకు డబ్బులు వేస్తున్నామన్నారు.

మంచి చేసే వలంటీర్లను తిడతారా :

కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ఇంట్లో నుంచి బయటకు రాలేని సమయంలో కూడా వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించారని, అలాంటి సేవకులనే పవన్ కళ్యాణ్ తిడతారా ? అని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షాత్తూ దేశ ప్రధాని నరేంద్రమోదీ వలంటీర్ల సేవలు భేష్ అంటూ ప్రశంసించారన్నారు. వలంటీర్లపై పగటి వేషగాడు పవన్ కళ్యాణ్ వారాహి అని ఒక రథయాత్ర పేరుతో తిరుగుతున్నాడని, నిజంగా 50 ఇళ్లకు వెళ్లి నిరంతం సేవ చేసి చూడు, అప్పుడు వలంటీర్లు చేస్తున్న సేవ కనిపిస్తుందన్నారు. ఎమ్మెల్యేగా, వార్డు మెంబర్‌గా కూడా గెలవలేవని, నీకంటే ఉన్నతమైన స్థానంలో ఉన్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పవన్‌కళ్యాణ్‌కు తగదన్నారు. నియోజకవర్గంలో మాజీ మంత్రి పరిటాల సునీత కూడా కరోనాకు భయపడి అడ్రస్ లేకుండా పోతే.. అప్పట్లో నాతో పాటు నా కుటుంబ సభ్యులందరం పేదలకు నిత్యావసర సరుకులు, శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేశామన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ప్రజల సమస్యలు తీరుస్తోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ అన్నారు. ఎం.బండమీదపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ఎంపీడీఓ సాల్మన్, ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, హౌసింగ్ ఏఈ రామ్మూర్తి, ఎంపీపీ జయలక్ష్మీ, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవాద ఉద్యమాలు అప్పుడు గుర్తుకురాలేదా?

- డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం క్రైం: విప్లవవాద రాజకీయాలు అప్పుడెందుకు గుర్తుకు రాలేదు పవన్ కళ్యాణ్ అని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్రజాస్వామిక విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, అప్పట్లో విప్లవవాద రాజకీయం పవన్ కళ్యాణ్‌కు ఎందుకు గుర్తుకురాలేదన్నారు. విప్లవవాదులు ఉద్యమాలు చేసి ప్రజలకు అండగా నిలుస్తారన్నారు. కానీ అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నావని అన్నారు. కాపుల అభ్యున్నతి కోసం ముద్రగడ పద్మనాభం ఉద్యమం చేసినప్పుడు ఆయన్ను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కేవలం చంద్రబాబు నాయుడు తొత్తుగా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. అధికార దాహం తప్ప ప్రజలకు మేలు చేద్దామనే ఆలోచన పవన్ కళ్యాణ్‌కు లేదన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రానున్న రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారన్నారు.

హస్తకళలను కాపాడుకోవడం అందరి బాధ్యత

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కల్చరల్: హస్తకళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఏపీ రాష్ట్ర హస్తకళలు – అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, ఎంపోరియం మేనేజర్ శ్రీనివాసులు తదితరులు ఎమ్మెల్యే అనంతను కలిశారు. గురువారం స్థానిక అజయ్‌ఘోష్ కాలనీలోని తోలుబొమ్మల కళాకారులు రామదాసు బృందంతో కలిసి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాకారులకు ఎలాంటి సమస్యలున్నా ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కరించుకోవాలన్నారు. చైర్‌పర్సన్ విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కళాకారుల కోసం విశేష కృషి చేస్తున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే కళాకారులకు రూ.10 లక్షల రుణాన్ని 35 శాతంతో మంజూరు చేస్తున్నాయని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయయాదవ్, రామ్మూర్తి, ఆదినారాయణనాయక్, రామదాసు, సుబ్బారావు, మనోహర్, ప్రభాకర్, నరసింహులు, వినోద్, నాయక్, కాటమయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకులు వలంటీర్లు



కోవిడ్ సమయంలో పింఛన్ అందజేస్తున్న 38 సచివాలయం మిసమ్మ కాలనీ వలంటీర్ బాలాజీ

అనంతపురం క్రైం : వలంటీర్లు కోవిడ్‌లాంటి విపత్కర పరిస్థితుల్లో ధైర్యంగా సేవలందించారు. కోవిడ్ సమయంలో ధైర్యంగా ప్రతి ఇంటికీ వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, మందులు, కూరగాయలు, పింఛను అందించారు. 38వ సచివాలయ వలంటీర్ బాలాజీకి వివాహమై నెలల వ్యవధిలోనే కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్నే వణికించింది. అదే సమయంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఇలాంటి సమయంలో ప్రజాసేవ పేరుతో బయటకు వెళ్లి రావడం అవసరమా? అని వారించారు. కానీ అతను ఏమాత్రం వెనకడుగు వేయకుండా ప్రజలకు సేవలు అందించడంలోనే తృప్తి ఉందంటూ భావించాడు. రోజువారీ విధులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేవాడు. ఆరుబయటే స్నానం చేసి, ఇంటి ఆవరణలో అన్నం తినేసి విధులకు వెళ్లేవాడు. నిస్వార్థంగా సేవలందిస్తున్న తమపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలు బాధించాయని చెప్తున్నాడు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ తమకు ఎంతో బలమని, ఉపాధి, గౌరవం ఇస్తోందని వలంటీర్ బాలాజీ చెప్తున్నాడు.

కన్న కొడుకులా సేవలందిస్తున్నాడు



పద్మావతమ్మ, జీసస్ నగర్, అనంతపురం

అయ్యా నాకు నా అన్నవారు ఎవరూ లేరు. జీసస్ నగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నా. దేవుడిలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లను ఏర్పాటు చేశారు. మా ఇంటికి రెండు, మూడ్రోజులకోసారి వలంటీర్ వచ్చి సమస్యలుంటే అడుగుతున్నాడు. ప్రతి నెలా మొదటి రోజునే పింఛన్ తీసుకొచ్చి ఇంటివద్ద ఇస్తాడు. చేయూతకు దరఖాస్తు చేసుకోవడానికి చాలాసార్లు ఇంటి వద్దకు వచ్చి ఆధార్ వివరాలు తీసుకెళ్లాడు. కన్న కొడుకులా బాలాజీ సేవలందిస్తున్నాడు . చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ పథకాల వచ్చిన డబ్బుల తోనే నేను బతుకుతున్నా.

– పద్మావతమ్మ, జీసస్‌నగర్, అనంతపురం

ఆర్టీసీ బస్టాండ్ పరిశుభత్రపై స్పెషల్ డ్రైవ్



సాక్షి ఎఫెక్ట్..

ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో శుభ్రం చేయిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ బస్టాండ్‌లో నెలకొన్న అపరిశుభ్రతపై అధికారులు స్పందించారు. ఆదివారం 'సాక్షి'లో 'అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన స్టేషన్ మేనేజర్ మూర్తి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే కార్మికులతో బస్టాండ్ ఆవరణ అంతా శుభ్రం చేయించారు. బస్టాండ్‌లో ఫ్యాన్లు మరమ్మతులు చేయిస్తున్నట్లు మేనేజర్ తెలిపారు. బస్టాండ్ పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వైఎస్ కుటుంబానికి రుణపడి ఉందాం



మత పెద్దలతో కలసి బ్రోచర్లు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ: వైఎస్ కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉందామని నగర మేయర్ వసీం , వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ అన్నారు.గురువారం నగరంలోని మస్జిద్ ఏ కిబ్రి మసీదులో 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైఎస్సార్ హయాంలో ముస్లిం మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి, ఏకంగా నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తండ్రి బాటలోనే నడుస్తూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఉర్దూ విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడమే గాక ముస్లిం మైనార్టీల విద్యార్థుల బంగారు భవితకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ఘనత కూడా వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం స్థానిక సమస్యలను మత పెద్దలు, ముస్లింలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్లు ఇషాక్, రహంతుల్లా, మసీదు ముతవల్లి రఫీక్ అహమ్మద్, మసీదు ఇమాం సిద్దిఖ్, కమిటీ సభ్యుడు దావుద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎస్కేయూ, జేఎన్‌టీయూ వీసీలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ రంగజనార్ధన

అనంతపురం: వర్సిటీల వైస్ చాన్సలర్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లిలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన, ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి వర్సిటీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

ఆత్మకూరు ఉప సర్పంచ్‌గా తైదుల శివారెడ్డి



తైదుల శివారెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి

ఆత్మకూరు: మేజర్ పంచాయతీ ఆత్మకూరు ఉప సర్పంచ్‌గా తైదుల శివారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. ప్రభుత్వ నిభంధనల ప్రకారం కోరం కన్నా ఎక్కువ వార్డు మెంబర్లు ఎన్నికకు వచ్చి ఎకగ్రీవంగా తైదుల శివారెడ్డిని ఎంపిక చేశారు. అనంతరం ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ శైలజా ఆధ్వర్యంలో శివారెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. శివారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాజకీయాల్లో స్థానం కల్పించిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి, తనను గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని, ఆత్మకూరు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైస్ ఎంపీపీలు విజయ్, నీలిమ,మాజీ సర్పంచులు రాజేశ్వరమ్మ, పార్వతమ్మ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యర్తలు , ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం ఉండగా... అధైర్యం ఎందుకు!

● యంగ్ టాలెంట్

ఆరోగ్యం నుంచి బాలీవుడ్ వరకు రకరకాల వీడియోలు చేస్తూ డిజిటల్ క్రియేటర్‌గా దూసుకుపోతుంది ఢిల్లీకి చెందిన సెజల్ కుమార్. 'ఫ్యాషన్-పాట-డ్యాన్స్' ఆమె బలం. మన దేశంలోని టాప్ యూట్యూబ్ స్టార్‌లలో సెజల్ ఒకరు. ఢిల్లీలోని 'ది మదర్స్ ఇంటర్నేషనల్ స్కూల్'లో చదువుకున్న సెజల్ కుమార్‌కు చిన్నప్పటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. తండ్రి ఆర్మీ మేజర్. ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో ఎకనామిక్స్‌లో డిగ్రీ చేసింది. టర్కీకి వెళ్లినప్పుడు 'సమ్మర్ స్టైల్' పేరుతో తొలి వీడియో అప్‌లోడ్ చేసింది. ఆ తరువాత సొంతంగా యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది.చానల్ కోసం చేసిన అయిదు వందలకు పైగా వీడియోలు బాగా పాపులర్ అయ్యాయి.

'ఇండియన్ గర్ల్ బ్యాక్‌ప్యాకింగ్ ఇన్ యూరప్' సిరీస్‌కు మంచి స్పందన లభించింది. సెజల్ తల్లి గైనకాలజిస్ట్. 'ఒక గైనకాలజిస్ట్‌ను అమ్మాయిలు అడగాలనుకునే సందేహాలపై వీడియోలు చేయవచ్చు కదా' అని చానల్ ప్రేక్షకులలో ఒకరు అడిగారు. ఆమె కోరిక మేరకు సెజల్ తల్లితో కలిసి చేసిన 'మామ్ అండ్ మీ' సిరీస్ బాగా పాపులర్ అయింది. ఎలాంటి ప్రశ్న అయినా స్వేచ్ఛగా, నిస్సంకోచంగా అడిగే వాతావరణాన్ని 'మామ్ అండ్ మీ' కల్పించింది.

సెజల్‌కు బాగా నచ్చే సబ్జెక్ట్‌లలో ఫ్యాషన్ ఒకటి. స్ట్రీట్ స్టైల్, స్ట్రీట్ వీడియోలపై మంచి పట్టు ఉంది. తన చానల్ 1 మిలియన్ ఫాలోవర్ మార్క్‌ను చేరుకున్నప్పుడు 'ఓ మై గాడ్' అనుకుంది ఆనందంగా. 'ఇదంతా నేను సొంతంగా సాధించాను' అనే ఆనందం సెజల్‌కు మరింత శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చింది. తన గొంతులోని ఛార్మింగ్ క్వాలిటీతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. యూట్యూబర్‌గా సెజల్ విజయరహస్యం ఏమిటి? ఆమె మాటల్లో...'మొదటి సూత్రం...గుడ్‌క్వాలిటీ కంటెంట్. గత వీడియో కంటే తాజా వీడియో ఎంతో కొంత బాగుండాలి. రెండో సూత్రం...ఎప్పుడో ఒకప్పుడు కాకుండా నిరంతరం ఏదో ఒక వీడియో పోస్ట్ చేస్తుండాలి. మూడో సూత్రం...ప్రేక్షకులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండాలి. మనల్ని మనం అప్‌డేట్ చేసుకోవాలి. వారికి ఎలాంటి వీడియోలు కావాలో తెలుసుకోవాలి'


సెజల్ కుమార్

సెజల్ యూట్యూబ్ చానల్ ప్రేక్షకులలో మహిళలు ఎక్కువ. పద్దెనిమిది నుంచి ఇరవైనాలుగు ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు ఉంటారు. 'ఒక కాలేజీ స్టూడెంట్ నా దగ్గరకు వచ్చి మీ పేరుతో కనిపించే వీడియో కనిపిస్తే చాలు క్షణం ఆలస్యం చేయకుండా చూస్తాను అని చెప్పింది. ఆమె మాటలు విన్న తరువాత మరింత కష్టపడాలి అనిపించింది' అంటుంది సెజల్. 'కాళీ కాళీ' మ్యూజిక్ ట్రాక్ సింగర్‌గా ఆమె ప్రతిభకు అద్దం పట్టింది. ఎన్నో వ్యాపారప్రకటనల లో నటించిన సెజల్...'కలలను నిజం చేసుకునే విషయంలో అధైర్యం వద్దు. మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి' అంటుంది.

జైపూర్‌లోని మణిపాల్ యూనివర్శిటీలో 'హౌ టు మేక్ యూట్యూబ్ ఏ కెరీర్?' అనే అంశంపై సెజల్ చేసిన ప్రసంగం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తి ఇచ్చి ముందుకు నడిపించింది.

● ఇంగ్లీష్ ఇడియమ్



వన్ హార్స్ టౌన్
చాలా చిన్న టౌన్ అని అర్థం

టేక్ సమ్‌వన్స్ వర్డ్ ఫర్ ఇట్
ఒక విషయాన్ని ఎలాంటి ఆధారం లేకపోయినా ఆమోదించడం.

గెట్ డౌన్ టు బ్రాస్ ట్యాక్స్
ఒక విషయానికి సంబంధించి ముఖ్యమైన చర్చను స్టార్ట్ చేయడం.

● సక్సెస్ స్టోరీ


తన కుటుంబంతో హర్ష్ అగర్వాల్



స్టార్ ఫ్యాషన్ డిజైనర్

ఫ్యాషన్ డిజైనర్‌కు రెండు కళ్లతో పాటు మూడో కన్ను ఉండాలి. ఆ కన్ను చారిత్రక,సాంస్కృతిక వైభవాన్ని చూడగలగాలి. కాలంతో పాటు నడుస్తూనే ముందు కాలాన్ని చూడగలగాలి. జైపూర్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్ హర్ష్ అగర్వాల్‌కు ఈ సామర్థ్యం ఉంది. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన 27 సంవత్సరాల హర్ష్ అగర్వాల్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్'తో అంతర్జాతీయ స్థాయిలో గెలుపు జెండా ఎగరేశాడు....

రెండు సంవత్సరాల క్రితం...ఆరోజు హర్ష్ అగర్వాల్ ఫ్యాషన్ లేబుల్ ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్‌కు నోటిఫికేషన్‌ల వరద మొదలైంది. పాపులర్ ఇంగ్లిష్ సింగర్ హారీ స్టైల్స్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్' ధరించి ఉన్న ఫొటోలు అవి. జైపూర్ ఫ్యాషన్ బ్రాండ్ అంతర్జాతీయ స్థాయిలో వెలిగిపోతుంది అని చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే.

'ఇలా ఉండాలి. అలా ఉండాలి' అంటూ చిన్నప్పుడు తన దుస్తులను తానే డిజైన్ చేయించేవాడు హర్ష్.

'ఎకనామిక్స్ అండ్ బిజినెస్'లో పట్టా పుచ్చుకున్న హర్ష్ వేరే దారిలో ప్రయాణిస్తానని ఊహించలేదు. 'ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్' ఇంటర్న్‌షిప్ న్యూయార్క్‌లో చేస్తున్న రోజుల్లో 'ఫ్యాషన్' అనే మాట ఎక్కడ వినబడితే తాను అక్కడ ఉండేవాడు. పేరున్న ఫ్యాషన్ డిజైనర్‌లతో ముచ్చటించేవాడు. ఈ క్రమంలో తనకు సొంతంగా ఏదైనా చేయాలనిపించేది.

ఇండియాకు తిరిగివచ్చిన తరువాత...పశ్చిమ బెంగాల్ నుంచి గుజరాత్ వరకు ఎన్నో ప్రాంతాలకు వెళ్లి మన చేనేతకళావైభవాన్ని రెండు కళ్లలో పదిలపరుచుకున్నాడు. వాటి నుంచి స్ఫూర్తి తీసుకొని తల్లి, సోదరితో కలిసి 'హరగో హ్యాండ్స్' అనే మెన్స్‌వేర్ లేబుల్‌కు శ్రీకారం చుట్టాడు.

ముగ్గురితో మొదలైన 'హరగో'లో ఇప్పుడు 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ టీమ్‌లో టైలర్‌లు, జూనియర్ డిజైనర్‌లు, ప్రొడక్షన్ ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

'హస్తకళలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలనుకున్నాను. మన దేశానికి తనదైన గొప్ప సాంస్కృతిక, శిల్పకళావైభవం ఉంది. అది చేతి వృత్తి కళాకారుల పనిలో ప్రతిఫలిస్తుంది. అలాంటి వారికి సహాయంగా నిలవాలనుకున్నాను' అంటాడు హర్ష్ అగర్వాల్.

ఒక డిజైన్ హిట్ అయిన తరువాత దాని వెంటే పయనించడం అని కాకుండా ఎప్పటికప్పుడు కొత్త కొత్త డిజైన్‌లపై వర్క్ చేస్తుంటాడు హర్ష్. ప్రతి రోజు ఒక కొత్త శాంపిల్ రూపొందిస్తాడు. 105 పీస్‌లు రెడీ కాగానే ప్రీ-ఆర్డర్స్ కోసం సోషల్ మీడియా పేజీలలో ప్రకటిస్తాడు.

కోవిడ్ కల్లోలం సద్దుమణిగిన తరువాత కొత్త కలెక్షన్ కోసం ఇంటర్నేషనల్ బయర్స్ నుంచి ఆర్డర్లు వెల్లువెత్తాయి. లేబుల్ క్లాతింగ్ రిటైలర్‌లలో మ్యాచెస్ ఫ్యాషన్-లండన్, సెసెన్స్(మాంట్రియల్), ఎల్‌ఎమ్‌డీఎస్-షాంఘై, బాయ్‌హుడ్-కొరియా...మొదలైనవి ఉన్నాయి.

'హరగో'కు ఇది టిప్పింగ్ పాయింట్‌గా మారింది. బ్రాండ్ అభిమానుల్లో ఇంగ్లాండ్‌కు చెందిన టెలివిజన్ హోస్ట్, ఫ్యాషన్ డిజైనర్ టాన్ ఫ్రాన్స్ ఉన్నాడు.

'కొన్ని నెలల క్రితం హర్ష్ బ్రాండ్ గురించి విన్నాను. నా నెట్‌ఫ్లిక్స్ షో కోసం అతడు డిజైన్ చేసిన దుస్తులు ధరించాను. కొత్తగా, కంఫర్ట్‌గా అనిపించాయి. డిజైనింగ్‌లో హర్ష్‌కు తనదైన నేర్పు ఉంది' అంటున్నాడు టాన్ ఫ్రాన్స్.

హర్ష్ కొత్త కలెక్షన్ డిజైన్ స్కెచ్‌లతో మొదలు కాదు. నేతకళాకారులతో ముచ్చటించిన తరువాత ఒక ఐడియా వస్తుంది. దాన్ని మెరుగులు దిద్దడంపై దృష్టి పెడతాడు. 'హర్ష్ వర్క్‌లో క్వాలిటీ మాత్రమే కాదు క్లాసిక్ లుక్ కనిపిస్తుంది' అంటుంది టెక్స్‌టైల్ ఇనోవేషన్ ప్రాజెక్ట్ 'అంబ' ఫౌండర్ హేమ ష్రాఫ్ పటేల్.

● టెక్.. టాక్

హువావే నోవా 11 ప్రో



● డిస్‌ప్లే: 6.78 అంగుళాలు ● రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్ ● బ్యాటరీ: 4500 ఎంఏహెచ్ ● ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ +8 ఎంపీ ● ర్యామ్: 8జీబి ● రిజల్యూషన్: 1200x2652 పిక్సెల్స్ ● ఇంటర్నల్ మెమోరీ: 256 జీబి ● ఆపరేటింగ్ సిస్టమ్: హామని ఓఎస్ ● బరువు: 188 గ్రా. ● కలర్స్: లుమినస్ గోల్డ్, డాన్ గోల్డ్, స్నోవీ వైట్



నాయిస్ ఫిట్ ట్విస్ట్ ప్రో స్మార్ట్‌వాచ్

● డిస్‌ప్లే: 1.4 అంగుళాలు ● ఫీచర్: బ్లూటూత్ కాలింగ్ మెటాలిక్ డయల్ ● హెల్త్ మానిటర్స్: హార్ట్‌రేట్, బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ సెన్సర్, స్లీప్ ట్రాకర్... మొదలైనవి. ● వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ ● 120 స్పోర్ట్స్ మోడ్స్ ● బ్యాటరీ: 300 ఎంఏహెచ్

టేబుల్ టాప్ స్టాండ్



బ్రాండ్: స్వాప్‌కార్ట్
కలర్: మల్టీ కలర్
కంపాటబుల్: ఆల్ స్మార్ట్‌ఫోన్స్ ప్రొడక్షన్ డైమెన్షన్స్: 16X10X4 సెంటీ మీటర్
ఫీచర్స్: ఫ్లెక్సిబుల్, ఫోల్డబుల్ ఆర్మ్
మెటీరియల్: అల్యూమినియం
బరువు: 240 గ్రా.

గూగుల్ ఫొటోస్‌లో కొత్త ఎఫెక్ట్‌లు...



ఫొటో అండ్ వీడియో వ్యూయింగ్ యాప్ 'గూగుల్ ఫొటోస్'లో ఫిక్స్ లైటింగ్, మ్యాజిక్ ఎరేజర్‌లాంటి ఎన్నో ఉపయోగకరమైన ఫీచర్లు ఉన్నాయి. తాజాగా త్వరలో రాబోతున్న 12 కొత్త ఎఫెక్ట్‌ల గురించి ప్రకటించింది గూగుల్. అవి ఏమిటంటే... బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్, లోమో, డస్ట్ మిక్స్, పేపర్ టియర్, లైట్ లీక్, ఫిల్మ్ మూడ్, ఫిష్ ఐ, క్రోమటిక్, వింటేజ్, లేఔట్స్, పోస్టర్ అండ్ రెట్రో ఫిల్మ్.

● గేమింగ్: నేడే విడుదల

వస్తున్నారహో!



ఊహించని ఉపద్రవం... కలలో కూడా చూడని క్రూర జంతుసమూహం... అడుగు తీసి అడుగు వేస్తే ప్రమాదం. ఎక్సోప్రైమల్‌లో ఎన్నో సవాళ్లు మీ కోసం ఎదురుచూస్తున్నాయి. థర్డ్-పర్సన్ షూటర్‌గేమ్ ఎక్సోప్రైమల్ నేడు విడుదల అవుతుంది. ఈ మల్టీప్లేయర్ యాక్షన్ గేమ్‌లో ప్లేయర్ డైనోసర్‌లతో పాటు ఎన్నో అపరిచిత మృగాలతో పోరాడవలసి ఉంటుంది. ప్లేయర్-వర్సెస్-ప్లేయర్-వర్సెస్ ఎన్విరాన్‌మెంట్ వీడియో గేమ్ ఇది. ప్లేయర్ ఎక్సోఫైటర్‌ను కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఈ గేమ్‌లో ఎన్నో రకాలైన వెపన్స్ ఉంటాయి. గేమ్‌లోని మెయిన్ మోడ్ డినో సర్వైవల్. 'ఎక్సోప్రైమల్'ను యాక్షన్ గేమ్‌గా తీర్చిదిద్దింది జపాన్‌కు చెందిన వీడియోగేమింగ్ కంపెనీ క్యాప్‌కామ్.

ఇంజిన్: ఆర్‌ఈ ఇంజిన్ ; జానర్: థర్డ్ పర్సన్ షూటర్ ; ప్లేస్టేషన్స్: ప్లే స్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

ఐ వాన్న వాకౌట్


పూజా హెగ్డే
రష్మికా మందన్నా

ఒక్క చాన్స్ వచ్చేవరకే ఎవరైనా ఆ చాన్స్ కోసం కష్టపడాలి. ఆ ఒక్క చాన్స్ బంపర్ చాన్స్ అయితే ఆ తర్వాతి చాన్సులు అవే వస్తాయి. ఇందుకు ఓ ఉదాహరణ పూజా హెగ్డే, రష్మికా మందన్నా. స్టార్ హీరోయిన్లుగా ఈ ఇద్దరూ తెలుగు, తమిళ, హిందీ చిత్రాలు చేస్తూ దూసుకెళుతున్నారు. చివరికి ఈ ఇద్దరూ డేట్స్ సర్దుబాటు చేయలేక సినిమాలు వదులుకునేంత బిజీ. అటు హిందీకి వెళితే ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ కూడా ఈ మధ్య ఒక సినిమా వదులుకున్నారు. 'నో డేట్స్.. ఐ వాన్న వాకౌట్' అంటూ ఈ నలుగురూ వదులుకున్న చిత్రాల గురించి, పూజ-రష్మిక వాకౌట్ చేయడం వల్ల ఆ ప్లేస్‌ని రీప్లేస్ చేయడానికి దర్శక-నిర్మాతలు పరిశీలిస్తున్న హీరోయిన్ గురించి తెలుసుకుందాం.

గుంటూరు కారం మిస్

'ఒక లైలా కోసం'తో (2014) తొలిసారి తెలుగు తెరపై మెరిశారు పూజా హెగ్డే. ఆ తర్వాత వరుస సినిమాలతో ఇక్కడ ఫుల్ బిజీ. అటు తమిళ, హిందీ నుంచి అవకాశాలు దక్కించుకున్నారు. ఇలా బిజీగా ఉన్న పూజ ఇటీవల డేట్స్ సర్దుబాటు చేయలేక 'గుంటూరు కారం' నుంచి తప్పుకున్నారని ఆమె వ్యక్తిగత సిబ్బంది పేర్కొన్న విషయం తెలిసిందే. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. త్రివిక్రమ్‌తో 'అరవింద సమేత వీర రాఘవ', 'అల.. వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో నటించారు పూజ. 'గుంటూరు కారం' నుంచి వాకౌట్ చేయకపోయి ఉంటే ఈ ఇద్దరి కాంబోలో ఇది మూడో సినిమా అయ్యుండేది. అలాగే 'మహర్షి' వంటి హిట్ తర్వాత మహేశ్‌బాబు-పూజ కాంబోలో రెండో సినిమా అయ్యుండేది. అయితే 'గుంటూరు కారం' నుంచి పూజ తప్పుకున్నప్పటికీ సూర్యదేవర నాగవంశీతో కలిసి త్రివిక్రమ్ భార్య సాయి సౌజన్య నిర్మించనున్న చిత్రంలో ఈ బ్యూటీ నటించే చాన్స్ ఉందట. సాయిధరమ్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో రూపొందించనున్న చిత్రానికి పూజని హీరోయిన్‌గా తీసుకోవాలని నాగవంశి, సాయి సౌజన్య అనుకున్నారట. పూజని సంప్రదించారని సమాచారం. అయితే ఇంకా ఆమె కథ వినలేదట.


అనుష్క శర్మ


కియారా అద్వానీ

నితిన్ సినిమా మిస్

'ఛలో'తో తెలుగుకి పరిచయమయ్యారు రష్మికా మందన్నా. ఈ సినిమాలో సింపుల్ గాళ్‌గా ఎంట్రీ ఇచ్చి, స్టార్‌గా ఎదిగారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ సినిమాలు చేస్తున్నారీ బ్యూటీ. ప్రస్తుతం 'పుష్ప 2', 'రెయిన్ బో'తో పాటు మరో తెలుగు సినిమా, హిందీ చిత్రాలతో రష్మిక ఫుల్ బిజీ. అందుకే నితిన్ సరసన ఒప్పుకున్న చిత్రానికి కాల్‌షీట్స్ అడ్జెస్ట్ చేయలేకపోయారట. తెలుగులో రష్మిక ఎంట్రీ ఫిల్మ్ 'ఛలో' దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. తొలి హిట్ ఇచ్చిన దర్శకుడితో 'భీష్మ' వంటి రెండో హిట్ కూడా అందుకున్నారు రష్మిక. సో... వెంకీ కుడుములతో మూడో సినిమాని రష్మిక మిస్ అయ్యారు.

ఒకరు వదులుకున్న చాన్స్ ఆటోమేటిక్‌గా వేరొకరికి దక్కడం సహజం. అలా 'గుంటూరు కారం' నుంచి పూజా హెగ్డే తప్పుకోవడం శ్రీలీలకి, మీనాక్షీ చౌదరికి ప్లస్ అయింది. ముందు ఈ చిత్రంలో శ్రీలీలను రెండో హీరోయిన్‌గా అనుకున్నారు. కానీ పూజ తప్పుకోవడంతో ఆమె మెయిన్ హీరోయిన్ అయ్యారు. శ్రీలీల స్థానంలోకి మీనాక్షీ చౌదరి వచ్చారు. అలాగే నితిన్ సినిమా నుంచి రష్మికా మందన్నా తప్పుకోవడంతో ఆ చాన్స్ కూడా శ్రీలీలకే వెళ్లనుందని టాలీవుడ్ టాక్. అటు హిందీ 'జీ లే జరా' విషయానికొస్తే.. ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ తప్పుకోవాలనుకోవడంతో అనుష్కా శర్మ, కియారా అద్వానీ వంటి నాయికల పేర్లను పరిశీలిస్తున్నారట ఫర్హాన్ అక్తర్.

నిజానికి 'భీష్మ' సినిమాతో నితిన్-రష్మిక హిట్ పెయిర్ అనిపించుకున్నారు. ఒకవేళ రష్మిక డేట్స్ అడ్జెస్ట్ చేయగలిగితే మరోసారి ఈ జంట సిల్వర్ స్క్రీన్‌పై కనిపించేది.


మీనాక్షీ చౌదరి
శ్రీలీల


కత్రినా కైఫ్


ప్రియాంకా చోప్రా

రీప్లేస్ చేసేది ఎవరు?

బాలీవుడ్‌లో ఈ మధ్య ప్రకటించిన చిత్రాల్లో 'జీ లే జరా' అందరి దృష్టినీ ఆకర్షించింది. దానికి కారణం ఇది లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ కావడం, చిత్రదర్శకుడు ఫర్హాన్ అక్తర్ కథానాయికలుగా ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్‌లను ఎన్నుకోవడం. అయితే హాలీవుడ్ ప్రాజెక్ట్స్ వల్ల ఈ చిత్రాన్ని 2024లో ఆరంభించాలని ఫర్హాన్‌ని ప్రియాంక కోరారట. ఫర్హాన్ ఓకే చెప్పారని టాక్. ఈలోపు కత్రినా వేరే ప్రాజెక్ట్స్ ఒప్పుకోవడంతో ఈ చిత్రానికి డేట్స్ సర్దుబాటు చేయలేనన్నారట. కాగా 'సిటాడెల్ 2' స్టార్ట్ అయ్యే చాన్స్ ఉన్నందున టోటల్‌గా ఈ సినిమా నుంచి వాకౌట్ చేయాలని ప్రియాంక నిర్ణయించుకున్నారట. కత్రినా కూడా ఇదే నిర్ణయం తీసుకున్నారని సమాచారం.


ఆలియా భట్


'హాయ్ నాన్న' పోస్టర్

హాయ్ నాన్న

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'హాయ్ నాన్న' అనే టైటిల్ ఖరారు చేశారు. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ఈ చిత్రానికి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 'హాయ్ నాన్న' అని, హిందీలో 'హాయ్ పప్పా' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఫస్ట్ లుక్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. ''తండ్రీ-కూతురు భావోద్వేగాలతో కూడిన ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. యూనిక్ స్టోరీ లైన్‌తో రూపొందుతున్న ఈ చిత్రం అన్ని భాషలవారికీ కనెక్ట్ అవుతుంది. ఈ ఏడాది డిసెంబర్ 21న చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

మహారాజా రెడీ


విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి కెరీర్‌లో 50వ మైలురాయిగా తెరకెక్కిన చిత్రం 'మహారాజా'. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించారు. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, నట్టి నటరాజ్ కీలక పాత్రలు పోషించారు. ప్యాషన్ స్టూడియోస్ సుధన్ సుందరం, ది రూట్-థింక్ స్టూడియోస్ జగదీష్ పళనిసామి సమర్పణలో రూపొందిన ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

నార్నే నితిన్ కొత్త సినిమా షురూ


అల్లు అరవింద్, నయన్ సారిక, నార్నే నితిన్

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా కొత్త సినిమా షురూ అయింది. అంజిబాబు కంచిపల్లి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ 2 పిక్చర్స్‌పై బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకుడు మారుతి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందించారు. ''జీఏ 2 బ్యానర్‌లో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సహనిర్మాత: ఎస్‌కేఎన్, కెమెరా: సమీర్ కళ్యాణ్, సంగీతం: రామ్ మిర్యాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: భానుప్రతాప్, రియాజ్ చౌదరి, అజయ్ గద్దె.

మిస్టర్ ప్రెగ్నెంట్ డేట్ ఫిక్స్

'బిగ్ బాస్' ఫేమ్ సయ్యద్ సోహైల్ రియాన్ హీరోగా నటించిన 'మిస్టర్ ప్రెగ్నెంట్' విడుదల తేదీ ఖరారైంది. ఆగస్టు 18న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రూపా కొడవాయుర్ హీరోయిన్‌గా నటించారు. అప్పిరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించారు. ''ఈ చిత్రంలో సోహైల్ ప్రెగ్నెంట్‌గా కనిపించనున్నాడు. తెలుగు తెరపై ఇదొక కొత్త తరహా ప్రయత్నం. వైవిధ్యమైన సినిమాలకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో మా 'మిస్టర్ ప్రెగ్నెంట్' సక్సెస్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్.


సయ్యద్ సోహైల్, రూపా కొడవాయుర్

నా చివరి సినిమాని బలమైన కథతో చేయాలనుకున్నా!

- ఉదయనిధి స్టాలిన్



''నాయకుడు' చాలా మంచి కథ, పొలిటికల్ డ్రామా, సామాజిక న్యాయం, ప్రజల మధ్య సమానత్వం గురించి ఈ మూవీలో చర్చించాం. యూనివర్సల్ అప్పీల్ ఉన్న ఈ కథ తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుంది'' అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'మామన్నన్'. ఉదయనిధి స్టాలిన్ హీరోగా నటించి, నిర్మించారు. కీర్తి సురేష్ హీరోయిన్. జూన్ 29న ఈ చిత్రం విడుదలైంది. తెలుగులో 'నాయకుడు' పేరుతో ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ విడుదల చేస్తున్నాయి. నేడు ఈ మూవీ రిలీజవుతోంది. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ-''తెలుగులో నా గత చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. అందుకే ఈ సినిమాను తమిళంలో మాత్రమే విడుదల చేయాలనుకున్నాం. అయితే తమిళంలో మంచి వసూళ్లను సాధించడంతో ఏషియన్, సురేష్ ప్రొడక్షన్స్ తెలుగులో విడుదల చేస్తున్నారు. నేను సినిమాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాక నా చివరి సినిమాని బలమైన కథతో మారి సెల్వరాజ్‌తో చేయాలనుకున్నాను'' అన్నారు.